మోసం కాంగ్రెస్ నైజం

- లోక్‌సభ ఎన్నికలు ముగియగానే బోనస్‌పై మాట మార్చిన ప్రభుత్వం
- సన్న వడ్లకే ఇస్తామంటూ కొర్రీలు
- రైతులు కల్లాల్లో రోదిస్తుంటే మంత్రులు మాత్రం ఏసీ రూముల్లో గడుపుతున్నారు
- బోనస్‌పై అసెంబ్లీని అడ్డుకుంటాం
- గుండె జబ్బు తోనూ ధాన్యం కాపాడుకుంటున్న మల్లికాంబను చూస్తే హృదయం ద్రవీభవించింది: హరీశ్‌రావు
- జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ధాన్యం కేంద్రాల పరిశీలన

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

జయశంకర్ భూపాలపల్లి, మే 23(నమస్తే తెలంగాణ)/కొడిమ్యాల: రైతులను మోసం చేయడమే కాంగ్రెస్ నైజమని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. వడ్లకు బోనస్ అడిగితే మొరుగుతున్నారంటూ కాంగ్రెస్ మంత్రి రైతులను కుక్కలతో పోల్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సన్నాలతోపాటు దొడ్డు రకానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ సమావేశాలను అడ్డుకొని రైతులకు రూ.500 బోనస్ ఇచ్చేవరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. గురువారం ఆయన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్య విక్రయించేందుకు వచ్చిన రైతులతో హరీశ్‌రావు మాట్లాడారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామంటూ బాండు పేపర్లు రాసిచ్చారని, వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామంటూ రైతులకు సెల్‌ఫోన్ మెసేజ్‌లు పెట్టారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక రైతుల గుండెల మీద తన్నుతున్నది రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాదా? అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బోనస్ గురించి మాట్లాడకుండా, ఓట్ల డబ్బాలకు సీల్ వేసిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చి సన్నాలకే బోనస్ అంటూ కొర్రీలు పెడుతున్నదని ధ్వజమెత్తారు. జగిత్యాల జిల్లాలో యాసంగిలో 3,00,723 ఎకరాల్లో వరి పంట వేశారని, ఇందులో దొడ్డు వడ్లు 3 లక్షల 73 ఎకరాల్లో వేస్తే.. 650 ఎకరాల్లో మాత్రమే సన్న వడ్లు పండించారని చెప్పారు. 99% మంది రైతులు దొడ్డు వడ్లు పండించగా, 0.6% మాత్రమే సన్న వడ్లు సాగు చేశారని తెలిపారు. రైతులు సన్న వడ్లను ఇంటి అవసరాలకు మాత్రమే పండిస్తారని, కొనుగోలు కేంద్రాలకు తెచ్చి అమ్ముకునేంత పండించరని తెలిపారు. సన్న వడ్లు బయట అమ్ముకుంటే క్వింటాకు రూ.2,800 నుంచి రూ.3,000 వరకు వస్తున్నదని, ఇది ప్రభుత్వం ఇచ్చే బోనస్ కంటే ఎక్కువేనని రైతులు చెప్తున్నారని తెలిపారు. ఎకరం భూమిలో దొడ్డు రకం 27 క్వింటాళ్ల వరకు పండితే, సన్న రకం 15 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తున్నదని వివరించారు. సన్న రకంలో పంట దిగుబడి దాదాపు 7 నుంచి 8 క్వింటాళ్ల వరకు తక్కువగా వస్తున్నదని చెప్పారు. సన్నాలకు రోగాలు ఎక్కువగా సోకడంతో పెట్టుబడి వ్యయం పెరుగుతున్నదని, కాలపరిమితి కూడా నెల ఎక్కువగా ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని రైతుల్లో 90% మంది దొడ్డు వడ్లు పండిస్తారని తెలిపారు. 100 రోజుల్లో రైతులకు రూ.500 బోనస్, రైతుభరోసా ఎకరానికి రూ.15,000, రూ.2 లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ నాయకులు మోసం చేశారని ధ్వజమెత్తారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోగా ధాన్యం కొనడం కూడా ప్రభుత్వానికి చేత కావడం లేదని మండిపడ్డారు. గత యాసంగిలో కేసీఆర్ ప్రభుత్వం 67 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 37 లక్షల టన్నులకు మించి కొనలేదని చెప్పారు. దీంతో రైతులు ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక మంత్రేమో రైతుబంధు డబ్బులు అడిగితే చెప్పుతో కొడతా అంటున్నారని, మరో మంత్రేమో రూ.500 బోనస్ గురించి ప్రశ్నిస్తే.. 'మొరుగుతున్నారంటూ' రైతులను అవమానించేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంత్రులు హైదరాబాద్‌లో ఏసీల్లో కూర్చోవడం కాదని, కొనుగోలు కేంద్రాల్లో తిరుగుతూ ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా త్వరగా తూకం వేసేలా చూడాలని హితవు చెప్పారు. రైతులకు భయపడి మంత్రులు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని ఎద్దేవా చేశారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

కమలాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్‌రావుతో అక్కడ ఉన్న రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 15 రోజులుగా సుమారు 20 లారీలకుపైగా ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ఉన్నదని రైతులు వాపోయారు. పొద్దంతా ఎండబోస్తున్నామని, రాత్రి వచ్చే వానకు మళ్లీ తడుస్తున్నదంటూ తమ కష్టాలు చెప్పుకున్నారు. తేమ శాతం 16, 17 ఉండాలని అధికారులు చెప్తున్నారని, రోజూ వర్షాలు పడి తడుస్తుంటే అది ఎలా సాధ్యమని ఆవేదన వ్యక్తంచేశారు. నాయకులు, అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. వర్షాలకు పక్కనే ఉన్న చెరువులోకి ధాన్యం కొట్టుకుపోయేలా ఉన్నదని, కనీసం కటింగ్‌తో తీసుకోమని కోరినా వినేవారు లేరని ఆక్రందించారు. కేసీఆర్ ప్రభుత్వం ధాన్యం తెచ్చిన మూడు రోజుల్లోనే కొనుగోలు చేసేదని గుర్తుచేసుకున్నారు. వెంటనే హరీశ్‌రావు జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. 'ప్రతి గింజా కొంటాం.. తడిసిన ధాన్యం కొంటాం' అంటూ ప్రకటనలు చేస్తున్నారు. మరి కమలాపూర్‌లో పరిస్థితి ఏమిటి? 20 రోజులుగా వర్షాలకు ధాన్యం తడుస్తున్నా ఎందుకు కొనుగోలు చేయడం లేదు?' అని కలెక్టర్‌ను ప్రశ్నించారు. మూడు రోజుల్లో ధాన్యం మొత్తం లిఫ్ట్ చేయాలని కోరారు.

సన్నాలు పండిస్తే అప్పులే

- హరీశ్‌రావుతో రైతులు

కొనుగోలు కేంద్రంలో ఉన్న రైతులతో హరీశ్‌రావు కొద్దిసేపు సంభాషించారు. ఈ సందర్భంగా ఒక్కో రైతు తన బాధను హరీశ్‌రావుకు చెప్పుకున్నారు. ప్రభుత్వం సన్నాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తుందట.. మీరేమంటారు? అని హరీశ్‌రావు రైతులను అడుగగా.. 'సన్నాలు తిండికి మాత్రమే పండిస్తాం. సన్నాలకు పెట్టే పెట్టుబడి గవర్నమెంట్ ఇస్తుందా? సన్నాలు మాకు గిట్టుబాటు కాదు. సన్నాలు పండిస్తే అప్పులపాలే. వాళ్ల బోనస్ ఇవ్వకున్నా బాధలేదు. మా ధాన్యం కొంటే అదే పదివేలు' అంటూ రైతులు ముక్తకంఠంతో జవాబిచ్చారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు సన్నాలకు మాత్రమే బోనస్ అంటే వడ్లలో రాళ్లు ఏరేసినట్టుగా కాంగ్రెస్‌ను ఏరేసేవారని అన్నారు. జూన్‌లోనే రైతులకు ఎకరాకు రూ.7,500 చొప్పున రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పచ్చిరొట్ట అందించే పరిస్థితితో ప్రభుత్వం లేదని మండిపడ్డారు. గుండె జబ్బుతో ఉండి 20 రోజులుగా కేంద్రం వద్ద ధాన్యాన్ని కాపాడుకుంటున్న మల్లికాంబ అనే మహిళా రైతు పరిస్థితి విని 'నా హృదయం ద్రవీభవించిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో పూజలు

మల్యాల, మే 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక ముడుపుకట్టిన హరీశ్‌రావు తాను ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆలయ ప్రాకార మండపంలో ప్రత్యేక పూజలు చేసి, ముడుపును విప్పారు. అనంతరం ప్రధాన ఆలయంలోని ఆంజనేయస్వామివారిని, ప్రధాన ఆలయంలోని వెంకటేశ్వరస్వామి, లక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మల్లికాంబ కంటతడి

కమలాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన హరీశ్‌రావు ఎదుట అక్కడే ఉన్న గాజె మల్లికాంబ అనే మహిళా రైతు కన్నీరు మున్నీరుగా విలపించింది. 'మూడు ఎకరాల్లో దొడ్డు రకం వేశాను. 20 రోజులుగా ఐకేపీలోనే ఉంటున్నాం. వడ్లు కొనేటోళ్లు లేరు' అంటూ ఆమె కన్నీరు పెట్టుకున్నారు. 'వర్షానికి తడిసిన వడ్లను ఎండబోసేలోపే వర్షం వచ్చి మళ్లీ తడిసి పోతున్నది. ఇప్పటికే సగం వడ్లు వర్షానికి కొట్టుకుపోయాయి. నాకు గుండె జబ్బు ఉన్నది. అయినా ఎండ, వానకు ఇక్కడ పడి వడ్లను చూసుకుంటున్న. రాత్రి అయితే ఇక్కడ కరెంటు ఉండదు. గాలి వానకు ఎన్ని పరదాలు కప్పినా లాభం ఉంటలేదు. మొత్తం వడ్లన్నీ తడిసినయ్. తేమ పేరుతో అధికారులు ఇబ్బంది పెడుతర్రు. గిట్ల వర్షం కొడితే తేమ ఎక్కడుంటది సారూ. దయచేసి నాకు న్యాయం చేయండి సారూ' అంటూ ఆమె హరీశ్‌రావు చేతులు పట్టుకున్నది. 'కలెక్టర్‌తో మాట్లాడుతా. తప్పకుండా నీ వడ్లు కొనేలా చేస్తా' అని ఈ సందర్భంగా హరీశ్‌రావు ఆమెకు అభయమిచ్చారు.

లోకం పోకడ

కొంప మనిగింది డాక్టర్,, మీరు కాలు ఆపరేషన్ చేయబోయి కడుపు కోశారు!

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	43.3°c	24.1°c
నల్లగొండ	42.3°c	26.6°c
ఖమ్మం	42.0°c	29.0°c
మెదక్	41.6°c	23.2°c
మహబూబ్‌నగర్	40.7°c	30.2°c
నిజామాబాద్	40.5°c	25.3°c
రంగారెడ్డి	40.1°c	21.8°c
కరీంనగర్	39.0°c	29.0°c
వరంగల్	38.0°c	28.0°c
హైదరాబాద్	36.4°c	23.1°c

సంగారెడ్డి జిల్లా కులబ్‌గూర్‌లో కొనుగోలు కేంద్రం సిబ్బందితో రైతుల వాగ్వాదం

ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై రైతుల కన్నెర్ర

రాయికల్/జూలపల్లి/సంగారెడ్డి, మే 23: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం రామాజీపేటలో కొనుగోలుకేంద్రంలో వడ్లు కొనడం లేదని రైతులు రోడ్డుపై బైఠాయించారు. 'అకాల వర్షాలతో వడ్ల కుప్పలు తడిసి ముద్దవుతున్నయ్. ధాన్యం ఇంకెప్పుడు కొంటరు?' అంటూ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. లారీలు, హమాలీల కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. తడిసిన ధాన్యం కొనడం లేదని సంగారెడ్డి మండలం కులబ్‌గూర్ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు కేంద్రం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. ఈ కేంద్రానికి పలువురు రైతులు తడిసిన ధాన్యాన్ని తీసుకురాగా.. మ్యాచర్ రాదని, ఇక్కడే ఆరబెడితే ఎండిన తర్వాత ఆ ధాన్యానికి కాంటా వేస్తామని సిబ్బంది చెప్పడంతో రైతులు మండిపడ్డారు.

ఎస్టీ రిజర్వేషన్ల రద్దుకు కాంగ్రెస్ కుట్ర

- మేల్కొని కొట్లాడకపోతే కేసీఆర్ ఇచ్చిన 10 శాతానికి ఎసరు
- విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్ సర్కార్
- కాంగ్రెస్ హామీలైన నిరుద్యోగ భృతి, విద్యా భరోసా కార్డులు ఏమయ్యాయి?
- టీచర్లపై లాఠీచార్జిపై పీఆర్టీయూ ఎందుకు మాట్లాడదు?
- ప్రశ్నించే రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి హరీశ్‌రావు
- భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్‌లో సమావేశాలు

వర్ధన్నపేట పట్టభద్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

వరంగల్, మే 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన 10% రిజర్వేషన్లను రద్దు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. మేల్కొని కొట్లాడకపోతే రిజర్వేషన్లు పోతాయని హెచ్చరించారు. ఈ రిజర్వేషన్ల వల్ల గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజినీర్లు అయ్యారని, ఇప్పటికైనా గిరిజన మేధావులు మేల్కొనాలని పిలుపునిచ్చారు. వరంగల్-నల్లగొండ-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా గురువారం నిర్వహించిన భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలకుర్తి, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల గ్రాడ్యుయేట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, యువకులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థులు.. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే సంక్షేమ పథకాలకు కోతలు, పేదలకు చార్జీల వాతలు అన్నట్టుగా పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. మార్పు అంటే ఉన్న పథకాలను తీసేసుడేనా? అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ చెప్పిన మార్పు ఎలా ఉన్నదో మీరు చూస్తున్నారు. ఇప్పుడు అంతా బాగుండాలంటే మంచి మార్పు రావాలి. ఇది విద్యావంతులతోనే మొదలుకావాలి' అని పిలుపునిచ్చారు. ఉద్యోగాల భర్తీ కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం తామే ఇచ్చినట్టుగా చెప్పుకుంటున్నదని ఎద్దేవా చేశారు. ఉద్యోగ పరీక్షలకు అప్లికేషన్ ఫీజు లేకుండా చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు టెట్ పరీక్ష ఫీజును రూ.400 నుంచి రూ.2 వేలకు పెంచిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పత్తా లేకుండా పోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో పెద్ద టీచర్స్ యూనియన్‌గా చెప్పుకునే పీఆర్టీయూ దీనిపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతుందని భరోసా ఇచ్చారు.

ప్రశ్నించే గొంతు ఎవరో చూడాలి

కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు విధానాలను ఎవరు ప్రశ్నిస్తారో గ్రాడ్యుయేట్లు ఆలోచించి ఓటు వేయాలని హరీశ్‌రావు కోరారు. నిరుద్యోగ భృతిపై కాంగ్రెస్ మోసం చేస్తే, ప్రశ్నించే గొంతుక అని చెప్పుకునే తీన్మార్ మల్లన్న ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. బ్లాక్ మెయిలర్ మల్లన్న కావాలా? విద్యావంతుడు రాకేశ్‌రెడ్డి కావాలా? విద్యావంతులు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 'రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీ టాపర్. ప్రజలకు సేవ చేయాలని తపన ఉన్న వ్యక్తి. వరంగల్ బిడ్డ. ఇక్కడి వారు రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాలి' అని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించే సత్తా ఉన్న రాకేశ్‌రెడ్డి.. నిరుద్యోగులకు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు ఎం సంజయ్ కుమార్, కల్వకుంట సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, బానోతు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రసమయి బాలకిషన్, వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎం సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడిందని, ఇది ఆదివారం సాయంత్రంకల్లా తీవ్ర తుఫానుగా మారనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. బెంగాల్ లేదా బంగ్లాదేశ్ తీరంలో తీరం దాటనున్నదని, ఆ సమయంలో గంటకు 102 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో రాగల రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువొచ్చని పేర్కొన్నది.

కలెక్టర్ పేరిట నకిలీ ఎఫ్‌బీ ఖాతా

ఖిలావరంగల్, మే 23 : సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా కేంద్రంగా సామాన్యులతోపాటు సంపన్న వర్గాల ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఫేక్ అకౌంట్లు సృష్టించి ఆర్థికంగా దోచుకుంటున్నారు. ఇందులో భాగంగా సైబర్ నేరగాళ్లు వరంగల్ కలెక్టర్ పీ ప్రావీణ్య పేరుతో నకిలీ ఫేస్ బుక్ అకౌంట్ తెరిచి డబ్బులు కావాలంటూ ఫేక్ మెసేజ్ పెట్టారు. దీంతో స్పందించిన కలెక్టర్ మోసపూరితమైన మెసేజ్‌లను నమ్మొద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు శ్రీలంక సీరిస్ మొబైల్ నంబర్‌కు డబ్బులు ఫోన్ పే ద్వారా పంపి స్క్రీన్‌షాట్ షేర్ చేయాలని కోరుతున్నట్టు తెలిపారు. తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వకూడదని పేర్కొన్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

రామగుండం ఫ్రైట్ డిపోకు ఐఎంఎస్ సర్టిఫికెట్

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ) : ఇండియన్ రిజిస్టర్ క్వాలిటీ సిస్టమ్స్ (డివిజన్ ఆఫ్ ఐఆర్ క్లాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్) నుంచి దక్షిణ మధ్య రైల్వే జోన్ రామగుండం ఫ్రైట్ డిపోకు 'ఐఎంఎస్' సర్టిఫికెట్ లభించినట్టు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో ప్రధానమైన ఫ్రైట్ డిపోల్లో రామగుండం ఒకటి అని చెప్పారు. ఈ డిపోను 1982లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

42% రిజర్వేషన్ల హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలి: బీసీ నాయకులు

చిక్కడపల్లి, మే 23: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని బీసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో బీసీ రాజ్యాధికారం సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ మాట్లాడుతూ.. కులగణన లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీల వ్యతిరేక తప్పదని హెచ్చరించారు. బహుజన సామాజిక వేత్త వీజీఆర్ నారగోని మాట్లాడుతూ రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ ఓబీసీ నాయకురాలు భాగ్యలక్ష్మి, జస్టిస్ పార్టీ నాయకుడు చిన్నశ్రీకాంత్, ఎంబీసీ నాయకులు మీనా గోపి, వెంకటేశ్ గౌడ్, మారేపల్లి లక్ష్మణ్, అడ్వకేట్ వంశీ కృష్ణ, వెంకటస్వామి , యాదగిరి, నరేందర్, పద్మావతి, స్వప్న, దుర్గేశ్ పాల్గొన్నారు.

'హాస్టల్ బిల్లులు చెల్లించండి'

హైదరాబాద్, మే23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 700 బీసీ,1500 ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలోని 8లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వారం రోజుల్లో బకాయిలు చెల్లించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

'ఇండ్లు 50% బీసీలకే ఇవ్వాలి'

హైదరాబాద్, మే23 (నమస్తే తెలంగాణ): డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇండ్లు 50శాతం బీసీలకే కేటాయించాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి పుట్టిన రోజు సందర్భంగా కోమటిరెడ్డిని శాలువాతో సత్కరించారు.

పేరు అమ్మలది.. పెత్తనం కాంగ్రెస్ లీడర్లది!

- సర్కారు బడుల పనుల్లో నేతల జోక్యం
- సమావేశాలకు కమిటీ సభ్యులకు బదులుగా నేతల హాజరు
- జూన్ 12 గడువు.. అనేక జిల్లాల్లో ఇంకా ప్రారంభం కాని పనులు
- డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.600 కోట్లు కేటాయింపు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సర్కారు బడుల రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు క్షేత్రస్థాయిలో అభాసుపాలవుతున్నాయి. 'పేరు అమ్మలది.. పెత్తన కాంగ్రెస్ లీడర్లది' అన్నట్టుగా సాగుతున్నది వ్యవహారం. ఈ పనుల్లో కాంగ్రెస్ నేతల జోక్యం పెరగడంతో పలు పాఠశాలల్లో పనులు ముందుకు సాగడంలేదు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో పనులు చేపట్టేందుకు మహిళా సంఘాలు సమాయత్తమయ్యాయి. కానీ స్థానిక కాంగ్రెస్ లీడర్లు తామే చేపడతామంటూ మెలికపెట్టడంతో ఇప్పటివరకు పనులు ముందుకు సాగడంలేదు. కోరుట్ల నియోజకవర్గంలోని మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి కమిటీ సభ్యులకు బదులు కాంగ్రెస్ నేతలు హాజరు కావడంతో అధికారులు బిత్తరపోయారు. పలు జిల్లాల్లోను ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తున్నది. ఎంపిక సమయంలోనే 'మన ఊరు –మన బడి' కార్యక్రమంలో చేపట్టిన స్కూళ్లను మినహాయించారు. ఆయా స్కూళ్లను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టేందుకు పరిగణనలోకి తీసుకోలేదు.

మైనర్ రిపేర్లు మాత్రమే

సర్కారు బడుల్లో వసతులు కల్పించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయా బాధ్యతలను స్వయంసహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) అప్పగించింది. ఇందుకోసం అమ్మ ఆదర్శపాఠశాల కమిటీలను ఏర్పాటుచేసింది. మౌలిక వసతులు, టాయిలెట్లు, మరమ్మతులు, శానిటేషన్, యూనిఫారాలు కుట్టించడం వంటి 10 రకాల పనులను ఈ కమిటీలకు అప్పగించారు. ఒక్కో స్కూల్‌కు ఎమర్జెన్సీ ఫండ్‌గా పాఠశాల స్థాయిలో రూ. 25వేలు, ఎంపీడీవోలకు లక్ష వరకు మంజూరుచేసే అధికారమివ్వగా, లక్షకు మించిన పనులను మంజూరుచేసే బాధ్యతలను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. ఈ నిధులతో బడుల్లో అవసరమైన కరెంట్ స్విచ్‌లు, వైర్లు, ట్యూబ్‌లైట్లు, బల్బులు, ఫ్యాన్లు, నీటి సరఫరా ఏర్పాట్లు, నల్లాల బిగింపు, మూత్రశాలల రిపేర్లు, తలుపులు, కిటికీలు వంటి వాటికి మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. తొలుత మేజర్ రిపేర్లను సైతం చేపడతామని ప్రకటించి, బడ్జెట్ పెరుగుతున్నదని మేజర్ రిపేర్లను పక్కనపెట్టారు. ఈ మైనర్ రిపేర్ల పూర్తికి జూన్ 12 గడువు విధించా రు. పలు పాఠశాలల్లో ఇంకా పనులు ప్రారంభంకాలేదు. గడువులోపు పూర్తికావడం కష్టంగానే కనిపిస్తున్నది. పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డీఈవో సహ ఇతర అధికారులకు నోటీసులిచ్చారు.

డీఎంఎఫ్‌టీ నిధులు మళ్లింపు..

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టాల్సిన పనుల కోసం విద్యాశాఖ దాదాపు రూ.1100 కోట్లకు పైగా అంచనాలు రూపొందించింది. కానీ ప్రభుత్వం ఇటీవల రూ. 600 కోట్లు మాత్రమే విడుదల చేసింది. జిల్లా కలెక్టర్ల వద్ద గల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) నిధులను ఈ పథకం కోసం మళ్లించారు. వాస్తవానికి డీఎంఎఫ్‌టీ నిధులను మైనింగ్, కాలుష్య ప్రభావిత ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల పరిధిలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు విరుద్ధంగా రాష్ట్రమంతటా ఖర్చుచేసేందుకు మళ్లించడం గమనార్హం.

కాంగ్రెస్ ప్రచారాన్ని అడ్డుకున్న పట్టభద్రులు

నోటిఫికేషన్లు, ఉద్యోగాలు ఎక్కడని నిలదీత

రామగిరి, మే 23: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మద్దతుగా గురువారం సాయంత్రం నల్లగొండలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ప్రచారం చేయడానికి వెళ్లిన రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాంగ్రెస్ నాయకులను నిరుద్యోగులు అడ్డుకున్నారు. గ్రంథాలయంలో ఉద్యోగాల సాధనకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తమ బతుకులు మారుతాయని ఆలోచించామని, అమ్మానాన్న, అవ్వాతాతల కాళ్లు పట్టుకొని ఓట్లు వేయించామని చెప్పారు. అందరం కష్టపడి పని చేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఉద్యోగాల ఊసే లేదని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తే నోటిఫికేషన్లు వేయడానికి అవకాశం ఉండదని తెలిసి కూడా జాప్యం చేస్తూ నిరుద్యోగులను మోసం చేశారని మండిపడ్డారు.

నల్లగొండ జిల్లా గ్రంథాలయంలో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్న యువత

సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధన్

నిరుద్యోగులు కాంగ్రెస్‌కు ఓటేయరు

- కేసీఆర్ పాలనలోనే నోటిఫికేషన్లు, పరీక్షలు
- 30 వేల ఉద్యోగాలిచ్చామని ఎలా చెప్తారు?
- ఉద్యోగాలపై కేసులేసింది కాంగ్రెస్ వాళ్లే?
- నిరుద్యోగుల బస్సుయాత్ర కన్వీనర్ వెల్లడి

ఖైరతాబాద్, మే 23 : నిరుద్యోగులు కాంగ్రెస్‌కు ఓటు వేయరని నిరుద్యోగుల బస్సు యాత్ర కన్వీనర్ జనార్దన్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి ఆర్నెళ్లు అవుతున్నా ఉద్యోగాల భర్తీ ఊసే లేదని.. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన జాబ్ క్యాలెండర్ ఉత్తిదేనని నిరుద్యోగులకు స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిరుద్యోగుల బస్సు యాత్ర కో-కన్వీనర్లు శరత్, యుగేందర్, గోపాల్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి.. పరీక్షలు నిర్వహించి.. ఫలితాలిస్తే... అధికారంలో కొచ్చి నాలుగు రోజులు గడవకముందే ఆ ఉద్యోగాలను భర్తీ చేసి... అంతా తామే చేశామని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానిది సిగ్గులేని చర్య అని విమర్శించారు. 30వేల ఉద్యోగాలు రాకుండా కేసులు వేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని ప్రశ్నించారు. ఆ కేసులు ఎత్తివేయించి బీఆర్‌ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను భర్తీ చేసి సీఎం రేవంత్ రెడ్డి జబ్బలు చరుచుకొంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సుమారు 80వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని పేజీ నం. 32లో పది లక్షల మంది నిరుద్యోగ యువతకు నెలకు రూ.10వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన రాహుల్, సోనియా, రేవంత్ రెడ్డిలు దీనిపై జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ వదిలిన బాణం అశోక్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ అధికారంలో ఉన్న పార్టీ నేత అయి ఉండి కూడా ఆ పార్టీ తప్పులను ఎప్పటికప్పుడు ప్రశ్నించారని, నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరినందునే ఆయనను బయటకు పంపించారని జనార్దన్ పేర్కొన్నారు. జడ్సన్‌ను ఓడించేందుకే ఆ పార్టీ నేత బల్మూరి వెంకట్.. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అశోక్‌ను దించారని తెలిపారు. కాంగ్రెస్ హామీలు నెరవేరాలంటే ముందుగా నిరుద్యోగులందరూ ఆ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను ఓడించాలని పిలుపునిచ్చారు.